# ప్రేమ

భార్యాభర్తలిద్దరూ, ఆరేళ్ళ కొడుకూ, లేదనుకోకుండా డబ్బూ - యిదీ వాళ్ళ సంసారం. కాబట్టి వాళ్లు చాల సుఖంగా వుండి వుండొచ్చు. కాని లేరు.

వాళ్ళిద్దరి దృష్టిలోనూ జీవితం చాల విలువైంది. దాన్ని సఫలం చేసుకోవాలనే యిద్దరి ప్రయత్నమూనూ.

నిజమైన వివాహం ప్రేమను పండిస్తూ నిత్యనూతనంగా వుండాలని రూప నిశ్చితాభిప్రాయం. ఈ అభిప్రాయం యింత నిశ్చయంగా ఏర్పడటానికి స్త్రీ వ్యక్తిత్వంలోని సౌకుమార్యం ఒక కారణం కావచ్చు. పెళ్లికి ముందూ, తరువాత కూడా ఆమె చదివిన బోలెడు ఉదాత్త ప్రేమసాహిత్యం కారణం కావచ్చు.

కాని ఎనిమిదేళ్ల క్రితం ఆమె పెళ్లి జరుగుతున్న రోజునే తాను జీవితంలో దగాపడిపోయానని తెలుసుకుంది. ఆమె పెద్దక్క మహిత పెళ్లి జరుగుతున్నప్పుడు బావగారి చేష్టల్లో వ్యక్తమైన సున్నితమైన భావం అందరికీ ముచ్చట కలిగించింది అప్పుడు. మహిత చేతికంటిన పసుపు తుడుచుకోవడానికి తన కర్చీఫ్ అందించారు బావ. బిందెలో నుంచీ ఉంగరం వెలికితీసే పందెంలో పెనుగులాడినట్లు నటించి చివరకు మహితకే ఒదిలేశారు. ఇలాంటివే ఎన్నో మురిపాలు చూపారు.

తన భర్త ఋషికి అలాంటి సున్నితమైన భావాలు ఏ కోశానా లేవన్న విషయం తన పెళ్లినాడే గ్రహించింది రూప. తరువాత నిజజీవితంలోనూ అదే ఋజువైంది. ఋషి రూప కోసం యీ ఎనిమిదేళ్లలోనూ ఒక్క త్యాగం కూడా చెయ్యలేదు. ఎప్పుడూ యింకోసారి కాఫీ యిమ్మనీ, ఫలానా కూర చెయ్యమనీ, ఉప్మాలో ఉప్పు తక్కువైందనీ, స్నానానికి ఎక్కువగా వేడినీళ్ళు తొందరగా కావాలనీ, యిలాంటి చీకాకుల్తోనే ఎనిమిదేళ్లు వ్యర్థం చేశాడు. ఇహ అతను మారడనీ, తన కర్మ యింతేననీ, తన భావనా జగత్తులో విరాగినిలా అసంతృప్త మనోరథయై జీవించాల్సిందేననీ రూపకి స్పష్టమైంది. ఇప్పుడామె తన కాలాన్ని

కొల్లలుగా వస్తున్న ప్రేమసాహిత్యాన్ని చదవటంలో గడిపేస్తున్నది.

ఋషికి వివాహంలో అసంతృప్తి లేదు. జీవితం గురించి అతనికి స్పష్టమైన అభిప్రాయాలున్నవి. ప్రతి విషయం గురించీ ఒక్కో సిద్ధాంతం ఏర్పరచుకుంటూ వుండటం అతని పద్ధతీ, లక్ష్యమూను. ప్రపంచం అతనికి మేధా కసరత్తులు చేసే వ్యాయామశాల. వూరికే వుంటే ఏదో బోలుతనం అతన్ని బాధిస్తుంది. అందుకని ఇంట్లో వున్నప్పుడు రూపని ఏదోవిధంగా కవ్వించి విసిగించి స్థిమితపడుతూ ఉంటాడు.

రూప బి.ఏ. పాసైనా ఆమె లోకజ్ఞానం అంత గొప్పది కాదు. మేధాపరంగా ఆమె అభిప్రాయాలు అస్పష్టంగా ఉంటాయి. వాటిని ఒక కొలిక్కి తెచ్చుకోవటానికి అతని సహాయం అర్థించటం ఆమెకు తప్పనిసరి. అడిగినప్పుడల్లా అతను తన అతి తెలివినీ, వక్రబుద్ధినీ ప్రదర్శిస్తాడు తప్ప ఆమె అడిగినదానికి ఆమెకు నచ్చే సమాధానం చెప్పడు.

ఇప్పుడు రూప ఒక నవల చదువుతోంది. అందులో రచయిత ప్రేమను గురించి ఒక విచిత్రమైన అభిప్రాయం వెలిబుచ్చారు. అది తనకు నచ్చిందో లేదో తేల్చుకోలేకుండా వుంది రూప.

కొడుకు శ్రీనాథ్‌ను తీసుకెళ్లి అన్నం పెట్టాలన్న ప్రయత్నంలో చేతిలో పుస్తకంతోటే ముందుగదిలోకి వచ్చింది. శ్రీనాథ్ ఋషికెదురుగా కొంచెం దూరంలో కుర్చీలో కూర్చుని అంతరిక్ష స్వరూపం గురించి చర్చిస్తున్నాడు. తొందరలో రాకెట్ ఇంజనీర్ అవాలని వాడికి గట్టి సంకల్పం వున్నది. వాడి యీ సంకల్పం విషయంలో రూపకి సానుభూతి లేదు. అందుకే నిర్లక్ష్యంగా వాళ్ల సంభాషణ మధ్యలో జొరబడి "ప్రేమంటే ఏమిటి?" అని ప్రశ్నించింది ఋషిని.

"ఏ ప్రేమా?" అన్నాడు ఋషి తన మామూలు వక్రధోరణిలో.

ప్రేమ అన్న పదం ఎరగనట్లు! దోవనపోయే దానయ్యకీ, మూలనుండే ముసలమ్మకీ కూడా తెలుసు అది! చీకాగ్గలిగినా, తన అవసరం గనుక సౌమ్యంగానే చెప్పింది రూప-

"ఒక పురుషుడికీ, ఒక స్త్రీకీ మధ్యన వుండే అవినాభావ సంబంధం. ఒకరు లేనప్పుడు రెండోవారూ లేని స్థితి. జయదేవుడు - పద్మావతి, రోమియో - జూలియట్‌ల అమర ప్రేమ. అలాంటిది ఈ కాలంలో మీరెక్కడన్నా చూశారా?"

ఇహ తన చర్చ జరిగే అవకాశం లేదని గ్రహించి, మెకానోసెట్ తీసుక్కూర్చున్నాడు శ్రీనాథ్.

ఋషి ఆలోచించాడు. "అలాంటి ప్రేమా?... ఈ కాలంలోనా?... అలాటి బంధం యీ హేతు యుగపు మనస్తత్వంలో పుట్టడానికి వీల్లేదు. ఈకాలంలో అలా ఒకరి కోసం చచ్చేవారు అమాయకులో, తెలిసీ తెలియని వయసుపిల్లలో అయ్యుంటారు తప్ప వ్యక్తులైన వారు అలా చావరని ఖచ్చితంగా చెప్పొచ్చు"

రూపకి సమాధానం అసలు రుచించలేదు.

"నేను చదువుతున్న నవల్లో రచయిత ఏమన్నారంటే ప్రేమ కలిసి జీవించటం నుంచీ పుడుతుందని" అన్నది.

"కలసి జీవించటం నుంచీ సానుభూతి, సహకారంలాంటి సరళమైన అనుబంధాలు పుట్టొచ్చుగాని నీవు చెప్పేటటువంటి సంకీర్ణమైన, గాఢమైన బంధం పుట్టదు" తన అభిప్రాయాన్ని వెల్లడించాడు ఋషి.

"ఆయన మీకంటే ఎక్కువ తెలివిగలవాడేలెండి." రుసరుసలాడింది రూప.

రూప రుసరుసలాడితే తను గెలుస్తున్నట్లు తెలుసుకుంటాడు ఋషి. అందుకని తాపీగా ప్రశ్నించాడు-

"ఆ అనుభవజ్ఞుని వయస్సెంత? అతని భార్య వయస్సెంత? ఆ ప్రేమపక్షుల గురించి తెలుసుకోవాలనుంది" అన్నాడు.

"చాల్లెండి మీ వెటకారం. అతను డెబ్బైఏళ్ల ముసలాయన. ఆమె పోయింది."

ఋషి విజయగర్వంతో ప్రక్కనున్న టేబిల్‌ని విరక్కొట్టాలని ప్రయత్నించాడు. "అదీ పాయింటు! ఆయన పోలేదు కదా! ఆయన చెప్పే ప్రేమా నువ్వు చెప్పే ప్రేమా ఒకటి కాదు!" అన్నాడు.

ఇందాకట్నుంచి వాళ్ల వాదనని ఆదుర్దాగా గమనిస్తున్నాడు శ్రీనాథ్. ఈ కేకల పర్యవసానంగా చిన్న యుద్ధం రేగుతుందని వాడికి అనుభవపూర్వకంగా తెలుసు. ఋషి టేబిల్ మీద ధన్‌మని కొట్టగానే శ్రీనాథ్ మెకానోతో రాకెట్ కడుతూనే స్వగతంగా చిన్నగా మొదలెట్టాడు:

"అహం భావం... ఘోర ప్రమాదం...

అహంభావం... ఘోర ప్రమాదం...

అహంభావం... ఘోర ప్రమాదం..."

రానురాను గొంతుస్థాయి హెచ్చిస్తూ వస్తున్నాడు.

బాలల మాసపత్రికలే కాకుండా పదిపైసాల లైబ్రరీల్లో విశేషంగా లభించే

బాలసాహిత్యం అనబడే శవ, మంత్ర, భూతప్రేత పిశాచ సాహిత్యాల్లోని అద్భుతరసంతో పాటు అర్థం అయ్యీకాని పదజాలం బోలెడుంది వాడి దగ్గర. సందర్భానికి తగినవీ, కొన్నిసార్లు తగనివీ బరువైన మాటలు ధారాళంగా ప్రయోగిస్తుంటాడు శ్రీనాథ్.

"ఛత్... నోరు ముయ్యరా" అని ఒక కేక పెట్టి రూప ఆలోచనలో పడ్డది. ఋషి చెప్పేదీ ఆలోచించదగ్గదే...

"పోనీ, అది కారణాల కతీతంగా ప్రథమ వీక్షణంలో పుట్టడమే నిజమయ్యుండాలి!" అన్నది ఆశగా.

"అసలు ప్రేమ అనేదే ఒక భ్రమ!" తేల్చిచెప్పాడు ఋషి.

రూపకి మండుకొచ్చింది. అతని మాటల వలన ఆమె జీవితమే వ్యర్థమైపోతున్నది! "ప్రేమ అన్న భావమే మీకర్థం కాదు... అపూర్వమైన ఆ ప్రేమ భావం లేనప్పుడు వివాహానికి అర్థం ఏముంటుంది? జీవితాంతం వరకూ అది ఏ ఆధారంతో నిలుస్తుంది? మీలాంటివాళ్ల వలననే పెళ్లి అనేది బలహీన వర్గమైన ఆడవాళ్లని పీడించడంగా మిగుల్తోంది యిప్పుడు" అన్నది.

"అందుకే కదా రానురాను ప్రపంచమంతా డైవోర్సుని ఒప్పుకొంటున్నది!" తాపీగా సెలవిచ్చాడు ఋషి.

"ఒప్పుకుంటే ముందుగా డైవోర్సు యివ్వాల్సింది మీకే!"

"శుభం. హాయిగా బ్రతికిపోతాను" అనేసి "ఒరేయ్ శ్రీనాథ్... నోరు మూస్తావా లేదా?" అంటూ గావుకేక పెట్టాడు.

ఈ బండమనిషితో మాట్లాడి ఏమీ ప్రయోజనం లేదనిపించింది రూపకు "ప్రేమ అన్నది లేనప్పుడు అది ఎట్లాగూ సవ్యమైన పెళ్లి కాదు. వివాహంలో దైవాంశ వున్నదనీ, అది విడదీయరాని బంధమనీ మూఢనమ్మకాలు కల్పించుకొని దాన్ని నిలుపుకొంటున్నాం. నిజానికి అలాంటి బంధం ఏమీ లేదు!" కచ్చగా, పెద్దగా అరిచింది రూప. రూపకి ఏడుపు కూడా వస్తున్నది.

"గాలి దుమారం... మాయాజాలం...

గాలి దుమారం... మాయాజాలం..."

శ్రీనాథ్ ఒకరి మాటలు రెండోవారికి వినబడకుండా వుండేట్లు పెద్దగా కేక లేస్తున్నాడు.

ఋషికి వాడి మీద కొంచెం జాలి కలిగింది. 'వూరికే గొంతు చించుకొని అరవొద్దు'

అని వాడికంటే పెద్దగా అరిచి వాడిని కొంచెం శాంతింపజేశాడు.

"దైవాంశ వున్నదనీ, విడదీయరాని బంధమనీ నమ్మితే అదీ నిజమే అవుతుంది. నమ్మకమే నిజం" అన్నాడు రూపతో, జోరుగా తల వూపుతూ.

"మీదొక వితండవాదం, పోండి. ఎవరేది నమ్మితే అది నిజం అయిపోతుందా? అసలీ హిందూ పద్ధతి పెళ్ళిళ్ళు వుత్త అబద్ధాలు! స్త్రీని బానిసగా వుంచడానికి ఉద్దేశింపబడినవి అన్పిస్తోంది ఆలోచిస్తే."

"మీ రచయిత చెప్పినట్లు దానివలన యిద్దరు మనుషులు జీవితాంతం వరకూ కలిసి జీవించి, ఒకర్నొకరు అర్థం చేసుకోబోయి తనని తాను అర్థం చేసుకునే మహత్తరావకాశం కల్పిస్తోంది గదా యీ పద్ధతి! ఇందులో గొప్ప సైకాలజీ వుంది... అదీ ఒకరకం ప్రేమ అనుకోవచ్చు" అన్నాడు ఋషి ఉదారంగా.

అతను మొదట చెప్పినదానికి యిప్పుడు చెప్తున్నది పూర్తిగా వ్యతిరేకంగా వున్నట్లు తోచింది రూపకు. అతను నిజంగా చెప్తున్నాడో వ్యంగ్యంగా మాట్లాడుతున్నాడో స్పష్టం కాకుండా వుంది. అతనిప్పుడు చెప్పే ప్రేమ ఏకదేశంగా వుంది. దానికి రెండో మనిషి కేవలం నిమిత్త మాత్రంగా కన్పిస్తున్నది. ఈ ప్రేమ చాల ఘోరంగా వున్నది! రెండో మనిషి కోసం ఆత్మార్పణ చెయ్యటం కదా నిజమైన ప్రేమ!! రూపకి అంతా పెద్ద గందరగోళంగా అయిపోయింది.

"అసలు ప్రేమంటే ఏమిటీ?" అన్నది అయోమయంగా, మొదటికి వస్తూ.

ఋషికి విసుగు పుట్టింది. "రోకలి పట్టుకురా, తలకి చుడతాను" అన్నాడు. ఇంతవరకూ అతను చెప్పినదంతా బూడిదలో పోసిన పన్నీరైపోయినందుకు అతని బాధ.

ఈపాటికి శ్రీనాథ్ గొంతు తారాస్థాయినందుకున్నది.

"ఓం....హ్రీం...హూం... మంత్రకాళీ

క్షూం మంత్రకాళీ.... ఫటాఫట్

ఓం హ్రీం హూం.... ఫటాఫట్ మంత్రకాళీ

క్షూం క్షూం క్షూం ఫటాఫట్ మంత్రకాళీ"

చేతిలోని పుస్తకాన్ని ప్రక్కన పడేసి, విసురుగా లేచి వాడిని ఎత్తుకుని నోరు మూసింది రూప. "ఈ అతి తెలివి మాటలంటే నాకు మంట... అన్నీ వుత్తుత్తి మాటలు! పనికిమాలిన వాదనలు... మా బుజ్జి బంగారానికి అన్నం పెట్టాల్సింది వొదిలి పనిమాలా యీ మనిషితో ఎందుకు మాటలు పెంచుకున్నానో" గొణుక్కుంటూ బయల్దేరింది.

"ఎదుటిమనిషి చెప్పేదాన్ని విని అర్థం చేసుకునే శక్తి నీకెలాగూ లేదుగాని ఆ బుజ్జి బంగారానికి అన్నం పెట్టుకో చాలు" విసుక్కున్నాడు ఋషి. తను చెప్పిన అభిప్రాయాలన్నీ వుత్తుత్తి మాటలా?! ఛీ, ఛీ!

అమ్మానాన్నలిద్దరూ కర్తవ్యనిష్ఠులై తనని బంగారంగా గుర్తించటంతో స్థిమితపడ్డాడు శ్రీనాథ్. అమ్మ భుజం మీదినుంచీ వెనక్కి చూస్తూ, "మాట్లాడుకోవటం అయిపోయిందిగా, నాన్నా, అన్నం తిని రాగానే అంతరిక్షం సంగతి చెప్తావా?" అని కేకేశాడు యీ అరగంట కాలాన్ని వెనక్కి జరిపి, అది రేపిన దుమారాన్ని తుడిపేస్తూ.

★★★